

'కథ'లిక తెచ్చిన కారా మాస్టారు!

- 'కథానిలయం'తో ప్రత్యేక గుర్తింపు
- నేడు కాళీపట్నం రామారావు జయంతి

6లో



కారా మాస్టారు (ఫైల్)

ఆక్వాపై తుఫాన్ దెబ్బ!



- 'మొంథా'తో తీరని నష్టం
- చెరువుల్లో నీరుచేరి తగ్గిన ఉప్పుశాతం
- చేపలను వెంటాడుతున్న తెగుళ్లు
- ఆందోళనలో రైతులు

బూర్జపాడులో రొయ్యల చెరువు

ఇచ్ఛాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి)

మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా ఉంది ఆక్వా రైతుల పరిస్థితి. ఒకవైపు సుంకాల బెడద.. మరోవైపు మొంథా తుఫాన్ మిగిల్చిన నష్టంతో వారు విలవిల్లాడుతున్నారు. ఇటీవల తుఫాన్ ప్రభావంతో చేపల చెరువుల్లోకి వర్షపునీరు చేరింది. దీంతో ఉప్పునీటి శాతం తగ్గి రొయ్యలు, చేపల ఎదుగుదల లేకుండా పోతోంది. తమకు మరింత నష్టం వాటిల్లుతోందని ఆక్వా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 11 తీర మండలాల్లో 4 వేల హెక్టార్లలో ఆక్వా సాగవుతోంది. 1500 మంది చేపల చెరువులను నిర్వహిస్తున్నారు. వాటిలో 10వేల మంది వరకూ పని చేస్తున్నారు. ప్రధానంగా జిల్లాలో రణస్థలం, ఎచ్చెర్ల, గార, సంతబొమ్మాళి, సోంపేట, ఇచ్ఛాపురం, వజ్రపుకొత్తూరు, పోలాకి మండలాల్లో ఆక్వాలో భాగంగా చేపల చెరువులు సాగు చేస్తున్నారు. ఇచ్ఛాపురం మండలానికి సంబంధించి బూర్జపాడు పంచాయతీ పరిధిలోని డొంకూరు, శివకృష్ణాపురం, చిన్న లక్ష్మీపురం, పెద్దలక్ష్మీపురం గ్రామాల్లో దాదాపు 100 ఎకరాల్లో చేపల చెరువులు ఉన్నాయి. జిల్లాలో ఏడాదికి రూ.200 కోట్ల క్రయ విక్రయాలు జరుగుతుంటాయి. ప్రధానంగా విదేశీ ఎగుమతికి అవకాశం ఉండే రొయ్యలు సాగు చేస్తుంటారు. దేశీయంగా కూడా మన జిల్లాలో సాగుచేసే చేపలకు మార్కెట్ ఉంది. కానీ అమెరికాలో ట్రంప్ సుంకాల బెడద వెంటాడుతోంది. మరోవైపు ఇటీవల మొంథా తుఫాన్ తీవ్రత తీర ప్రాంతాలపై పడింది. ఫలితంగా ఆక్వా రంగం దెబ్బతింది. వర్షాలకు చెరువుల్లో నీరు చేరి ఉప్పునీటి శాతం తగ్గిపోయింది. ఆపై చలి పెరిగి.. పగటి ఉష్ణోగ్రతలు సైతం తగ్గుముఖం పట్టాయి. చెరువుల్లో చేప పిల్లలు ఒత్తిడికి గురై మేత తీసుకోవడం లేదు. నిరంతరాయంగా ఏరియేటర్లు తిప్పుతున్నామని ఆక్వా రైతులు చెబుతున్నారు. ఇటీవల భారీ వర్షాలకు రొయ్యలు తెగుళ్లబారిన పడ్డాయని, వాతావరణ మార్పులకు తట్టుకోలేక సగానికిపైగా చనిపోతున్నాయని పేర్కొంటున్నారు. వ్యాధుల కారణంగా 15 నుంచి 20 గ్రాముల మధ్యలోనే రొయ్య ఎదుగుదల ఆగిపోతోంది. సాధారణంగా ఎకరా ఆక్వా సాగుకు రూ.4 లక్షలు ఖర్చవుతోంది. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో పెట్టుబడులు రాకపోగా నష్టాలు మిగులుతున్నాయని రైతులు వాపోతున్నారు. అమెరికాలో సుంకాల సాకు చూపి రొయ్యలు, చేపలను (మిగతా 6వ పేజీలో..)

బాలియాత్రను జయప్రదం చేయండి

- నేడు సూర్యతీర్థం రేవులో తెప్పోత్సవానికి అనుమతి
- భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు: కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

జలుమూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): 'శ్రీముఖలింగేశ్వరాలయంలో ఆదివారం నిర్వహించనున్న బాలియాత్ర తెప్పోత్సవాన్ని విజయవంతం చేయాలి. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాల'ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, బాలియాత్ర కమిటీ సభ్యులతో కలిసి వంశధార నది తీరప్రాంతం, తీర్థ ఘట్టాల రేవులు, ఆలయ పరిసరాలను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'శ్రీముఖలింగేశ్వరాలయం నుంచి వంశధార నదికి వెళ్లే మార్గంలో ఉన్న హంసతీర్థం రేవు లోతు హెచ్చుగా ఉన్నందున తెప్పలు విడిచిపెట్టేందుకు వీల్లేదు. పండా వీధి నుంచి వంశధార నదికి వెళ్లే మార్గంలో ఉన్న సూర్యతీర్థం రేవు తెప్పలు విడిచిపెట్టడానికి అనువుగా ఉంది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఈ రేవు వద్దే తెప్పోత్సవానికి కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేయాలి. సూర్యతీర్థానికి వెళ్లే మార్గాన్ని చదును చేయించి శుభ్రం చేయాలి. మార్గానికి ఇరువైపులా విద్యుత్ దీపాలు అలంకరించాలి. సీసీ కెమెరాలు అమర్చాలి. వంశధార నదికి వెళ్లే భక్తులకు, తిరిగి వచ్చే భక్తులకు వేర్వేరు మార్గాలు ఏర్పాటు చేయాలి. ఆలయ ప్రాంగణంలో పటిష్టమైన బారీకేడ్లు ఉండాలి. నీడ, తాగునీటి సౌకర్యం కల్పించాల'ని ఆదేశించారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, కళింగ జేఏసీ కన్వీనర్ బొడ్డేపల్లి శ్రీరామచంద్రమూర్తి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తర్ర బలరాం, అర్చకులు ఎస్.వి.చలం, శ్రీకాకుళం ఆర్డీవో కె.సాయిప్రత్యూష, తహసీల్దారు జె.రామారావు, డిప్యూటీ ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఎంపీటీసీ కె.హరిప్రసాద్, సర్పంచ్ టి.సతీష్‌కుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సూర్యతీర్థం రేవును పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే రమణమూర్తి తదితరులు

ఇచ్ఛాపురంలో వైసీపీ ఓవరాక్షన్

- సోషల్ మీడియాలో పలాస వైసీపీ నేత అనుచిత పోస్టింగ్
- ఇచ్ఛాపురం తెచ్చి విచారణ చేయగా నాయకుల ఆందోళన
- పోలీసుల హెచ్చరికలతో జారుకున్న వైనం

ఇచ్ఛాపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం పోలీస్‌స్టేషన్ వద్ద వైసీపీ నేతల హైడ్రామా కొనసాగింది. విచారణ కోసం ఓ వైసీపీ నేతను పోలీసుస్టేషన్‌కు తీసుకొస్తే స్థానిక నాయకులు ఓవర్ యాక్షన్‌కు దిగారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ఇటీవల పలాస-కాశీబుగ్గ జంట పట్టణానికి చెందిన ఓ వ్యాపారి కిడ్నాప్‌కు గురయ్యారు. ఆయనది ఆమదాలవలస కాగా.. గత కొద్దిరోజులుగా పలాసలో నివాసముంటున్నారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పలాస నియోజకవర్గానికి చెందిన వైసీపీ నేత శిష్టు గోపి సోషల్ మీడియాలో ఒక పోస్టు చేశాడు. కిడ్నాప్ ఘటనకు సంబంధించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా, ఉద్రిక్తతలు రేపేలా తప్పుడు పోస్టులు పెట్టాడు. ఈ విషయం పోలీసుల దృష్టికి రాగా.. గోపిని అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల కాశీబుగ్గలోని ఆలయంలో తొక్కిసలాట ఘటనకు సంబంధించి వివాదం జరిగిన నేపథ్యంలో శాంతిభద్రతల కారణాల దృష్ట్యా గోపిని కాశీబుగ్గ స్టేషన్‌లో కాకుండా ఇచ్ఛాపురం టౌన్ పోలీస్‌స్టేషన్‌కు శనివారం తీసుకొచ్చి విచారించారు. ఏఎస్పీ శ్రీనివాసరావు, సీఐ మీసాల చిన్నంనాయుడు విచారణ చేపట్టిన అనంతరం సాయంత్రం విడిచిపెట్టారు. అయితే ఇదే అదునుగా ఇచ్ఛాపురం వైసీపీ నాయకులు స్టేషన్ వద్దకు వచ్చి ఆందోళన చేశారు. అయితే తాము విచారణకు మాత్రమే తెచ్చామని.. ఇక్కడ నుంచి వెళ్లిపోవాలని పోలీసులు హెచ్చరించడంతో వైసీపీ నేతలు అక్కడ నుంచి జారుకున్నారు.

ఏడు గంటలపాటు సీదిరి విచారణ

- పోలీసుస్టేషన్‌కు తాళం వేస్తానని, రంగు వేస్తానని అప్పట్లో వ్యాఖ్యలు
- వీటిపై నోటీసులు ఇచ్చి హాజరు కావాలన్న పోలీసులు



సీదిరిని విచారణ చేస్తున్న సీఐ సూర్యనారాయణ

పలాస, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఓ కేసు విచారణ నిమిత్తం మాజీ మంత్రి, పలాస వైసీపీ సమన్వయకర్త సీదిరి అప్పలరాజుకు శనివారం కాశీబుగ్గ పోలీసులు ముందస్తు నోటీసులు జారీ చేశారు. పోలీస్‌స్టేషన్‌కు విచారణకు రావాలని ఆదేశించారు. ఈ మేరకు మధ్యాహ్నం 2.30గంటలకు అప్పలరాజు తన అనుచరులతో పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. అప్పటి నుంచి రాత్రి 9.45 వరకు ఏడుగంటల పాటు ఆయన్ను ఏఎస్పీ పి.శ్రీనివాసరావు, కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ, ఎస్ఐ నరసింహమూర్తి విచారణ చేపట్టారు. అనంతరం విచారణ పత్రాలపై ఆయన నుంచి సంతకాలు తీసుకుని విడిచిపెట్టారు. సోమవారం మళ్లీ విచారణకు హాజరు కావాలని ఏఎస్పీ పి.శ్రీనివాసరావు సీదిరికి సూచించారు.

కేసు ఏమిటంటే...

ఓ టీడీపీ నాయకుడు కేసునకు సంబంధించి గతేడాది అక్టోబరు 27న మాజీమంత్రి సీదిరి అప్పలరాజు తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ 'బాలికపై దాడి చేసిన వ్యక్తులపై పోక్సో కేసు నమోదు చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. పోలీస్‌స్టేషన్ లోపల దాడి చేసిన వ్యక్తులపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలి. లేదంటే పోలీస్ స్టేషన్ ఇక్కడ ఉందని మేము భావించం. పోలీస్‌స్టేషన్‌కు పసుపు రంగు వేసి తాళాలు వేస్తాం. ఇక్కడ టీడీపీ కార్యకర్తలకు మాత్రమే అనుమతి. సామాన్య ప్రజలు రావద్దని బోర్డులు పెడతాం. మేము ప్రైవేటు పోలీస్‌స్టేషన్ పెట్టి దానిని ఎస్పీతో ప్రారంభిస్తామ'ని తెలిపారు. 'ప్రజల చేతుల్లోకి లా అండర్ సమస్య వెళ్లేలా చేయొద్దు. ఎస్పీ మహేశ్వరరెడ్డి నీకే చెబుతున్నాం. జర్నలిస్టులు, కానిస్టేబుల్‌పై కూడా దాడి చేశారు. సిగ్గుగా (మిగతా 6వ పేజీలో..)

రోడ్డుపై గుమిగూడిన వైసీపీ శ్రేణులు

- సీదిరి అప్పలరాజు విచారణకు హాజరుకావడంతో.. నియోజకవర్గం నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలు కూడా కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌కు చేరుకున్నారు. స్టేషన్ బయట రోడ్డుపై గుమిగూడారు. వాహనాలు రోడ్డుపై నిలిపేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. శాంతిభద్రతలకు ఇబ్బందులు కలిగేలా రోడ్డుపై గుమిగూడరాదని.. వెళ్లిపోవాలని వారికి శ్రీకాకుళం ఏఎస్పీ పి.శ్రీనివాసరావు, పోలీసులు సూచించారు. అత్యవసర సేవలకు ఇటువంటి సంఘటనలు తీవ్ర ఇబ్బందికరమని, అవసరమైతే కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌కు కాశీబుగ్గ సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న సీఐలు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, ఏఆర్ సిబ్బంది మొత్తం తరలివచ్చారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే పీడీ యాక్ట్
- ఏడాదిన్నరలో గంజాయి సాగు లేకుండా నిర్మూలించాం
- డీఐజీ గోపీనాథ్ జట్టి

6లో

పెండింగ్ కేసులను పరిష్కరించండి
ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి • ఎచ్చెర్ల పోలీసులతో సమీక్ష

7లో

రోడ్డుపక్కనే కంకర తవ్వకాలు
- పట్టించుకోని రెవెన్యూ, పంచాయతీ అధికారులు

8లో

వెంటాడుతున్న భవనాల కొరత
- చాలీచాలని వసతిలోనే మత్స్యకార రెసిడెన్షియల్ పాఠశాల నిర్వహణ

ఓబీసీ గుర్తింపేదీ?

- ఉన్నత విద్య, ప్రభుత్వ ఉద్యోగాలకు దూరం
- నువ్వలరేవు కేవీటీ కులస్థుల ఆవేదన
- కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుపై ఆశలు



నువ్వలరేవు గ్రామం

వజ్రపుకొత్తూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): వజ్రపుకొత్తూరు మండలంలోని నువ్వలరేవు.. జిల్లాలోనే ప్రత్యేకమైన గ్రామం. శ్రీరామనవమి ఉత్సవాలు, సామూహిక వివాహాలు వైభవంగా జరుగుతుంటాయి. ఆచార సంప్రదాయాలు, కుల కట్టుబాట్లు, పెద్దల తీర్పును శిరసావహించే కేవీటీ కులస్థులు రాష్ట్రంలో ఈ ఒక్క గ్రామంలోనే 95 శాతం మంది ఉన్నారు. పశ్చిమబెంగాల్, ఒడిశా రాష్ట్రాల్లో కేవీటీలను ఎస్సీలుగా గుర్తించారు. మన రాష్ట్రంలో మాత్రం బీసీ-ఏగా కొనసాగుతున్నారు. సముద్రంలో చేపలు పట్టడం, విక్రయించడం వారి వృత్తి. సుమారు 300 ఏళ్ల కిందట ఒడిశా నుంచి ఉపాధి కోసం చాలామంది నువ్వలరేవు వచ్చి.. ఇక్కడ స్థిరపడ్డారు. తొలుత వీరు ఓసీగానే కొనసాగినా 14 ఏళ్ల కిందట బీసీ-ఏ జాబితాలో చేర్చారు. వీరంతా ఓబీసీ గుర్తింపు కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. ఓబీసీ గుర్తింపు లేక ఉన్నత చదువులకు దూరమవుతున్నామని, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జేఈఈ మెయిన్స్, నీట్ లాంటి ఉన్న చదువుల్లో రిజర్వేషన్ పొందలేక తీవ్రంగా నష్టపోతున్నామని వాపోతున్నారు. ఓబీసీగా గుర్తింపు కోసం అధికారులు, నాయకుల దృష్టికి అనేకసార్లు తీసుకెళ్లినా ఫలితం లేకపోతోందని ఆవేదన చెందుతున్నారు. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అయినా స్పందించి (మిగతా 6వ పేజీలో..)



దూసి రైల్వేస్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న డీఆర్ఎం లలిత్‌బొహరా, రైల్వే అధికారులు

దూసి రైల్వేస్టేషన్ అభివృద్ధికి కృషి

- డీఆర్ఎం పరిశీలన

ఆమదాలవలస, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస మండలం దూసి రైల్వేస్టేషన్‌ను శనివారం వాల్తేరు డివిజన్ రైల్వే మేనేజర్ లలిత్‌బొహరా పరిశీలించారు. జాతిపిత మహాత్మగాంధీ అడుగుపెట్టిన రైల్వేస్టేషన్‌గా 'దూసి' గుర్తింపు పొందింది. ఎంతో చరిత్ర కలిగిన ఈ రైల్వేస్టేషన్ అభివృద్ధికి కృషి చేయాలని స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు ఇటీవల కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకి వినతిపత్రం అందజేశారు. ఆయన సూచన మేరకు డీఆర్ఎం శనివారం దూసి రైల్వేస్టేషన్‌ను అధికారులతో కలిసి పరిశీలించారు. ప్లాట్ ఫారం, ప్రయాణికుల విశ్రాంతి భవనం, తాగునీరు, వసతి, లైటింగ్ సదుపాయాలతోపాటు స్టేషన్ ఆవరణలో మహాత్మగాంధీ నాటిన చెట్టును పరిశీలించారు. స్టేషన్ అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు రూపొందించి రైల్వే ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు
- పాల్గొన్న ఉమ్మడి జిల్లాల హైస్కూల్ విద్యార్థులు

6లో

నది గట్టు.. కనిపిస్తే ఒట్టు!

- ఆక్రమణలో మహేంద్రతనయ
- పట్టించుకోని అధికారులు

మెళియాపుట్టి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తాగునీరు, సాగునీటి వనరుల్లో ఒకటైన మహేంద్రతనయ నది ఆక్రమణకు గురవుతోంది. ఒకవైపు ఇసుక కోసం నదీ గర్భాన్ని అక్రమార్కులు తవ్వేస్తున్నారు. మరోవైపు కొంతమంది నదికి ఇరువైపులా గట్టులు సైతం ఆక్రమించి పొలాలుగా సాగు చేస్తున్నారు. వరి, కూరగాయలు పండిస్తున్నారు. నదీ తీర ప్రాంతం ఆక్రమణకు గురవుతున్నా అధికారులు చూసీచూడనట్టు వదిలేస్తున్నారు. ఒడిశా రాష్ట్రం తూర్పుకనుముల్లో నుంచి మహేంద్రతనయ జిల్లా మీదుగా ప్రవహిస్తోంది. జిల్లాలో మెళియాపుట్టి మండలం చాపర మీదుగా హిరమండలం మండలం గొట్టాబ్యారేజీలోని వంశధార నదిలో కలుస్తోంది. చాపర నుంచి హిరమండలం వరకు సుమారు 20 కిలోమీటర్లు నది పొడవు ఉంటుంది. అధికంగా మెళియాపుట్టి, కొసమాళ, రట్టిణి, నడసందర, పెద్దపద్మాపురం, చంగుడి, కొసంగిపురం, పాతపట్నం, కొరసవాడ వద్ద నది చుట్టుపక్కలా పొలాలుగా ఏర్పాటు చేసి కూరగాయలు, వరి పంటలు పండిస్తున్నారు. మరికొందరు మామిడి, టేకు మొక్కలు పెంచుతున్నారు. మెళియాపుట్టి ప్రాంతంలో మహేంద్రతనయ నది 150 మీటర్లు వెడల్పు ఉండేది. ప్రస్తుతం నదికి ఇరువైపులా ఆక్రమణలు పెరిగిపోతుండడంతో కుచించుకుపోతోంది. దీంతో వర్షాలు కురిసే సమయంలో నీటి ప్రవాహానికి అవకాశం లేక గండ్లు పడుతున్నాయి. ఫలితంగా కొన్ని ప్రాంతాల్లో పంటలు నీట మునిగిపోతున్నాయి. దీంతో నదీ తీర ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. తాగునీటికి సైతం ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

- ఈ విషయమై మెళియాపుట్టి తహసీల్దార్ బి.పాపారావు వద్ద ప్రస్తావించగా, మహేంద్రతనయ నదీ ప్రాంతంలో ఆక్రమణలు గుర్తించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



మెళియాపుట్టిలో మహేంద్రతనయ నది గట్టును ఆక్రమించి.. పొలాలుగా మార్చిన వైనం

కథలిక తెచ్చిన కారా మాస్టారు

- 'కథానిలయం'తో ప్రత్యేక గుర్తింపు
- నేడు కాళీపట్నం రామారావు జయంతి


కారా మాస్టారు (ఫైల్)


కథా నిలయం

ఉపాధ్యాయునిగా..

కారా మాస్టారు 1924 నవంబరు 9న లా వేరు మండలంలోని మురపాకలో జన్మించారు. శ్రీకా కుళంలో ఎస్ఎస్ఎల్‌సీ పూర్తి చేశారు. భీమిలిలో సెకెండరీ గ్రేడ్ ట్రైనింగ్ స్కూల్‌లో ఉపాధ్యాయ శిక్షణ పొందారు. 1943 నుంచి 1946 వరకూ నాలుగైదు చోట్ల వివిధ ఉద్యోగాలు చేసినా స్థిరంగా ఇమడగలిగింది మాత్రం ఉపాధ్యాయ వృత్తిలోనే. 1948 నుంచి 31 ఏళ్ల పాటు ఒకే ఎయిడెడ్ హైస్కూల్‌లో ఉద్యోగం చేశారు. 1972లో ప్రాథమిక పాఠశాల హెడ్‌మాస్టారుగా ఉద్యోగ విరమణ చేశారు. 96 ఏళ్ల వయసులో 2021 జూన్ 4న తుదిశ్వాస విడిచారు.

రచనలు.. పురస్కారాలు..

యజ్ఞం, అభిమానాలు, రాగమయి, జీవధార, రుతుపవ నాలు (కథా సంకలనం), కారా కథలు, కథాకథనం, కథా యజ్ఞం వంటివి ఆయన కలం నుంచి జాలువారాయి. బొమ్మిడాల కృష్ణమూర్తి ఫౌండేషన్ వారి పురస్కారం, ఎన్టీఆర్ జాతీయ పురస్కారం (ఎన్టీఆర్ విజ్ఞాన్ ట్రస్ట్), కొండేపూడి శ్రీనివాసరావు సాహితీ సత్కారం అందుకున్నారు.

శ్రీకాకుళం/శ్రీకాకుళం అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలుగు కథ ఒంటరిగా మిగిలిపోకూడదని.. దానికి ఓ ఆశ్రయం కల్పించిన వ్యక్తి కాళీపట్నం రామారావు (కారా) మాస్టారు. తెలుగులో రచయితల ప్రచురణలన్నీ డిజిటల్‌గా లభ్యం కావాలని ఆలోచించిన కథల ప్రేమికుడు కారా మాస్టారు. అవార్డుగా వచ్చిన నగదును మూలధ నంగా పెట్టి.. కథానిలయానికి పునాది వేసిన ఆ కథా రచ యిత జయంతి నేడు. కారా మాస్టారును.. కథానిల యాన్ని వేర్వేరుగా చూడలేం. కథా నిలయంలో దొరకని తెలుగు కథ అంటూ ఉండకూడదని ఆయన ఆశయం. శ్రీకాకుళం నగ రంలోని విశాఖ-ఎ కాలనీలో ఉన్న కథానిలయం వార్షికోత్స వాన్ని ఏటా ఘనంగా నిర్వహిస్తూ.. దాని విశిష్టతను నేటి తరానికి తెలియజెప్పాలనేది ఆయన లక్ష్యం. చివరి వరకూ దీని కోసం ఆయన చేసిన కృషి మరువలేనిది.

● తెలుగు కథకు శాశ్వతత్వాన్ని కల్పించాలని..

తెలుగు కథకు శాశ్వతత్వాన్ని కల్పించాలనేది కారా మాస్టారి లక్ష్యం. ఓ దినపత్రికలో 'నేటి కథ' శీర్షికను నిర్వహించి.. కొత్త రచయితలకు అవకాశమిచ్చారు. ఆయన కథలు ఇతర భారతీయ భాషలలోకి, రష్యన్, ఇంగ్లీషు భాషలలోకి అనువాదమయ్యాయి. అక్కడ కూడా పాఠకుల ఆదరణ చూరగొన్నాయి. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును ప్రకటించినప్పుడు మాస్టారు సందిగ్ధంలో పడ్డారు. ఆ అవార్డును తెలుగు కథకు ఉపయోగకరంగా వాడవచ్చు అని చాలా మంది ఆత్మీయులు ఇచ్చిన సూచనతో అవార్డును స్వీకరించారు. బహుమతిగా వచ్చిన మొత్తంతో తన కలలకు రూపమైన కథానిలయానికి పునాది వేశారు. కారా మాస్టారి భావనలో 'కథానిలయం' నిజంగా తెలుగు కథకి నిలయం. 75 శాతం పుస్తకాలు.. పాత పత్రికలు.. డిజిటలైజేషన్ చేయించారు. 1997లో శ్రీకాకుళంలో కథానిలయం పుట్టింది. గురజాడ అప్పారావు 'దిద్దుబాట' వెలువడిన ఫిబ్రవరి 22న ఇది ప్రారంభమైంది. ఆయన సాహిత్య సంపాదనలో ప్రతి పైసా కథానిల యానికి అందించారు. అనేక మంది సాహిత్యాభిమానులు, రచయితలూ చేయి వేశారు. కథలతో పాటు వాటి కాల నేపథ్యాన్ని... సమాజ నేపథ్యాన్ని... అధ్యయనం చేసేందుకు వీలుగా ఆత్మకథలు, జీవిత కథలు, సామాజిక చరిత్రలు, ఉద్యమ చరిత్రలు కూడా సేకరిస్తున్నారు. ప్రస్తుతం కథానిలయంల 75,467 కథలు ఉన్నాయి. మొత్తం 36,55,836 మంది ఇప్పటి వరకూ వీటిని చదివారు.

● 'యజ్ఞం'తో విశేష గుర్తింపు..

వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైన కారా మాస్టారి రచనా శైలి సరళంగా ఉంటుంది. రాసినవి స్వల్ప సంఖ్యలోనే అయినా.. విశేష గుర్తింపు పొందారు. 1966లో ఆయన కలం నుంచి వెలువడిన 'యజ్ఞం' కథ తెలుగు పాఠకుల నుంచి విశేష మన్ననలు పొందింది. దోపిడీ స్వరూప స్వభావాలను సరళంగా.. సహజంగా..అందులో ఆవిష్కరించారు. దీనికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. అప్పట్లో ఈ కథ తెలుగు పాఠకుల్లో విశేష చర్చకు దారి తీసింది.

● బయటి ప్రాంతాలో వార్షికోత్సవం..

ప్రతి ఏటా కథానిలయం వార్షికోత్సవాన్ని నిర్వహిస్తు న్నాం. కారా మాస్టారి సమయంలో ఉన్న అనేక మంది రచయితలకు ఇప్పుడు వయసు మళ్లింది. దీంతో గత నా లుగేళ్ల నుంచి వార్షికోత్సవాన్ని బయటి ప్రాంతాల్లోనే నిర్వ హిస్తున్నాం. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కారా మాస్టారి గు రించి వర్తమాన రచయితలకు తెలిసేలా.. అప్పటి వారికి ఇబ్బంది లేకుండా వివిధ ప్రాంతాల్లో దీన్ని నిర్వహిస్తున్నాం.

-దాసరి రామచంద్రరావు, కార్యదర్శి, కథానిలయం

ఏడు గంటలపాటు సీదిరి విచారణ

(ఐదో పేజీ తరువాయి)

లేదా మీకు. వారిపై హత్యాయత్నం కేసు పెట్టాల్సిందే'నని సీదిరి డిమాండ్ చేశారు.

● ఈ వ్యాఖ్యలపై పలాస మండ లం కిష్టుపురానికి చెందిన బి.విజయ కృష్ణరాజు కాశీబుగ్గ పోలీసులకు అప్ప ట్లో ఫిర్యాదు చేశారు. 'మాజీ మంత్రి సీదిరి ప్రజలను రెచ్చగొడుతూ, ప్రభు త్వాన్ని కించపరుస్తూ తప్పుడు ప్రచా రం చేస్తున్నారు. ప్రైవేటు పోలీస్‌స్టేషన్ పెడతామని తప్పుడు సంకేతాలిస్తూ.. ఉద్యమ భావజాలాన్ని ప్రజల్లోకి పంపి స్తున్నారు. ప్రజల మధ్య విద్వేషాలు కలిగిస్తూ ప్రశాంతతకు భంగం కలిగి స్తున్నార'ని ఫిర్యాదులో పేర్కొన్నారు.

● దీనిపై కాశీబుగ్గ పోలీసులు శనివారం సీదిరికి ముందుగానే నోటీసులు జారీ చేసి విచారణకు హాజరుకావాలని కోరారు. ఈ మేరకు సీదిరి అప్పలరాజు విచారణకు హాజరుకాగా.. ఎందువల్ల ఆ వ్యాఖ్యలు చేయాల్సి వచ్చిందని పోలీసులు ప్రశ్నించినట్టు సమాచారం.

ప్రశ్నించిన వారిని స్టేషన్‌కు రప్పిస్తున్నారు

● మాజీమంత్రి అప్పలరాజు ఆరోపణ

పలాస/కాశీబుగ్గ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ పోలీసులు నిందితులను విడిచిపెట్టి.. అన్యాయంపై ప్రశ్నించిన వారిని పోలీస్‌స్టేషన్‌కు రప్పించి విచారిస్తుండడం దారుణమని సీదిరి అప్పలరాజు ఆరోపించారు. విచారణ అనంతరం రాత్రి పోలీసుస్టేషన్ రోడ్డులో విలేకరులతో ఆయన మాట్లాడారు. టీడీపీ నాయకులు రెండు కేసుల్లో వేధించి.. దాడి చేశారని, బలవంతంగా ఇబ్బంది పెట్టారని ఓ బాలిక చెప్పడంతో.. పోలీసులు ఏ మేరకు విచారణ చేస్తున్నారని తెలుసుకోవడానికి తాను గతంలో ప్రశ్నించానని తెలిపారు.

ఆక్వాపై తుఫాన్ దెబ్బ!

(ఐదో పేజీ తరువాయి)

వ్యాపారులు తక్కువ ధరకు అడుగు తున్నారని పేర్కొంటున్నారు.

● వైసీపీ హయాంలో ఆక్వారంగం పూర్తిగా నీరసించింది. జగన్ సర్కారు కనీస ప్రోత్సాహ చర్యలు చేపట్టలేదు. కూ టమి ప్రభుత్వం ప్రోత్సహించేందుకు చా లారకాల మినహాయింపులు ఇచ్చింది. ఎటువంటి నిబంధనలు విధించకుండా చెరువులు సాగుచేసే వారికి రాయితీ వి ద్యుత్ అందించాలని నిర్ణయించింది. రూ. 1.50కే యూనిట్ విద్యుత్‌ను అందించా లని సీఎం చంద్రబాబు ఆదేశాలిచ్చారు. దీంతో జిల్లాలో చేపల చెరువులు పెరి గాయి. ఇంతలోనే అమెరికా పన్నులు, మొంథాతుఫాను రైతులను దెబ్బతీసింది.

తుఫాన్‌తో నష్టం..

మొంథా తుఫాన్ మా బతుకులను దెబ్బతీసింది. వాతా వరణ పరిస్థితులు అనుకూలించక చేపలకు ఎదుగుదల లేకుండా పోయింది. వైసీపీ పాలనలో గడ్డు పరిస్థితులను ఎదుర్కొన్నాం. కూటమి ప్రభుత్వం విద్యుత్ రాయితీ ప్రక టించింది. ఆహార ఉత్పత్తులకు ప్రోత్సాహం అందించాలని నిర్ణయించింది. దీంతో భవిష్యత్ బాగుంటుందని ఆశించాం. కానీ ఇప్పుడు చేపలకు తెగుళ్ల దెబ్బ తీస్తున్నాయి.

-దున్న కేశవరావు, బూర్జపాడు

కొనసాగుతున్న 'మొంథా' కష్టాలు


తురకపేట సమీపంలో నీట మునిగిన వరి పంటను కోస్తున్న దృశ్యం

ఎల్ఎన్ పేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గత నెలాఖరులో మొంథా తుపాన్ సృష్టించిన కష్టాల నుంచి రైతులు ఇంకా తేరుకోలేదు. తీవ్ర గాలుల తో కూడిన భారీవర్షాలకు వరి పంట నీటమునిగి నేలను తాకింది. పలు చోట్ల నేల కొరిగిన వరి పంట కుళ్లిపోయి మొలకలు వచ్చాయి. నదీతీర గ్రామా లతోపాటు లోతట్టు ప్రాంత రైతుల కష్టాలు వర్ణనా తీతం. నీటిలో నేలకొరి గిన పంటను ఒడ్డుకు చేర్చేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ఇంతవరకు మండలంలో ఎక్కడా ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో తడిచిన ధాన్యాన్ని అమ్ముకో లేని పరిస్థితి రైతులకు నెలకొంది. పంట నష్ట పోయిన రైతులకు పరిహారం ఇస్తామని ఓ వైపు ప్రభుత్వం ప్రకటించినా ఇంతవరకు పైసా అందకపోగా.. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసే నాథుడు లేకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధి కారులు స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతోపాటు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

● పాల్గొన్న ఉమ్మడి జిల్లాల హైస్కూల్ విద్యార్థులు


క్రీడాజ్యోతి వెలిగిస్తున్న ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు


పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థినులు

వజ్రపుకొత్తూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గోవిందపురంలో 69వ రాష్ట్రస్థాయి అండర్-14 హైస్కూల్ విద్యార్థుల అథ్లెటిక్స్ పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమ య్యాయి. ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ (ఏపీటీపీసీ) చైర్మన్ వజ్జ బాబూరావు, అగ్నికులక్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు ఈ పోటీలను ప్రారంభించారు. తొలుత జాతీయజెండా, క్రీడా జెండాలను ఆవిష్కరించి జాతీయగీతం ఆలపించారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు మార్చ్‌పాస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయన్నారు. రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న ఈ పోటీలను విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందన్నారు. రెండు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయని గోవిందపురం పాఠశాల హెచ్ఎం హరిబాబు అన్నారు. క్రీడాకారులకు అవసరమైన వసతి, భోజన సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. కార్య క్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు సూరాడ మోహ నరావు, కర్ని రమణ, మాజీ ఎంపీపీ గొరకల వసంతరావు, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు బుల్లోజు శశిభూషణ్, వివిధ పాఠశాల పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓబీసీ గుర్తింపేదీ?

(ఐదో పేజీ తరువాయి)

తమను ఓబీసీ జాబితాలో చేర్చాలని నువ్వల రేవుకు చెందిన కేవీటీ కులస్థులు కోరుతున్నారు.

ఉన్నత చదువులకు దూరం..



మా కుమారుడు మూ డేళ్ల వయసులో ఉన్న ప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కేవీటీ కులాన్ని బీసీ-ఏ జాబితాలో చేర్చింది. ప్రస్తుతం మా కుమా రుడు ఇంటర్మీడియట్ చదువుతూ.. ఐఐటీ పరీక్షలకు సిద్ధమవుతున్నా డు. ఓబీసీ లేకపోవడం వల్ల ఓసీ కోటాలోనే పోటీ పడాల్సి వస్తోంది. రిజర్వేషన్ కోల్పోతు న్నాం. మా గ్రామంలో చాలామంది ఉన్నత చదువులకు దూరమవుతున్నారు.

-బైనపల్లి భీమారావు, నువ్వలరేవు

న్యాయం చేయాలి..



కేవీటీ కులాన్ని ఓబీ సీగా గుర్తిస్తే.. అనేక మంది విద్యార్థులకు న్యా యం జరుగుతుంది. గ్రామంలో విద్యార్థులకు, నిరుద్యోగులకు ఉన్నత అవకాశాలు లభిస్తాయి. ఈ దిశగా కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు చొరవ చూపాలి.

-ఏజ్రా, మాజీ సర్పంచ్, నువ్వలరేవు

నాయకుల దృష్టికి తీసుకెళ్లాం..



కేవీటీలకు ఓబీసీ గుర్తింపు విషయమై నాయకులు, అధికా రుల దృష్టికి తీసుకెళ్లాం. ఎమ్మె ల్యే శిరీష సహకారంతో కేంద్ర మంత్రి రామ్మోహనాయుడును కలుస్తాం. విద్యార్థులు నష్టపో కుండా ఈబీసీ ధ్రువపత్రాలతో కొంతవరకు రిజర్వేషన్ పొందవచ్చు.

-పూర్ణ, సర్పంచ్, నువ్వలరేవు

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే పీడీ యాక్ట్

- ఏడాదిన్నరలో గంజాయి సాగు లేకుండా నిర్మూలించాం
- ఒడిశా నుంచి జిల్లా మీదుగా అక్రమ రవాణా
- 1700మందిపై సస్పెక్టెడ్ షీట్స్ తెరిచాం
- డిజిటల్ అరెస్ట్ అనేది వ్యవస్థలోనే లేదు
- ఐదుగురు పోలీసు అధికారులపై క్రిమినల్ చర్యలు
- డీఐజీ గోపీనాథ్ జట్టి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



శ్రీకాకుళం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన వారిపైన.. ప్రజల ధన మాన ప్రాణాలకు భంగం కలిగించే వారిపైన 'పీడీ' యాక్ట్ ప్రయోగిస్తామని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి హెచ్చరించారు. ఇటీవల శ్రీకాకుళం జిల్లాలో పర్యటించిన డీఐజీ 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసేందుకే పోలీసు వ్యవస్థ ఉందని.. ప్రజల పట్ల సరిగ్గా వ్యవహరించని పోలీసులపైనా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అంతర్గత సమాచారం సేకరించి.. క్రిమినల్ చర్యలు ఉంటాయని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటినుంచే సిద్ధమై.. నిఘా వ్యవస్థను పటిష్టం చేస్తున్నామని.. వ్యవస్థలోనే డిజిటల్ అరెస్ట్ అనేది లేదని స్పష్టం చేశారు.

● **ప్రశ్న:** విశాఖ రేంజ్ డీఐజీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మీ ప్రధాన లక్ష్యాలు ఏమిటి?

జవాబు: విశాఖపట్టణం రేంజ్‌లో మహిళలు, చిన్నపిల్లల భద్రత తొలి ప్రాధాన్యం. ఇందుకోసం రేంజ్ పరిధిలో 20వేలకు పైగా అవగాహన సదస్సులు నిర్వహించాం. చిన్నపిల్లలపై జరిగే అఘాయిత్యాలు పరిశీలిస్తే.. పరిచయమున్న వారే నేరాలకు పాల్పడుతున్నట్లు కేసుల ద్వారా తెలు స్తోంది. 'నారీశక్తి' పేరిట అవగాహన కార్యక్రమాలతో ప్రజలను చైతన్య పరుస్తున్నాం.

● **ప్ర:** శ్రీకాకుళం జిల్లాలో నేర నియంత్రణ, చట్ట వ్యవస్థ పరంగా మీరు గమనించిన ప్రధాన అంశాలేంటి?

జ: శ్రీకాకుళం జిల్లాలో గత ఏడాదితో పోల్చితే.. నేరాలు తగ్గుముఖం పట్టాయి. ప్రాపర్టీ అఫెన్స్‌లో రూ.8 కోట్లు ప్రాపర్టీ రికవరీ చేశారు. ఒడిశా, పశ్చిమబెంగాల్ నుంచి గ్యాంగ్‌లు ఇక్కడికి వచ్చి నేరాలకు పాల్పడి వెళ్లిపో తున్నాయి. ఇటువంటివి పట్టుకుంటున్నాం. తరచూ గొడవలు పడుతున్న వ్యక్తులను గుర్తించి.. బైండోవర్ కేసులు, సస్పెక్ట్ షీట్స్, రౌడీ షీట్స్ తెరుస్తున్నాం.

● **ప్ర:** మహిళల భద్రత, చిన్నారుల రక్షణ దృష్ట్యా పోలీసులు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

జ: మాకు పెద్ద బలం మహిళా పోలీసు వ్యవస్థ. గ్రామాల్లో మహిళా పోలీసులతో కార్యక్రమాలను నిర్వహించి.. క్షేత్రస్థాయిలో సమాచారాన్ని తెలుసుకోగలుగుతున్నాం. మహిళా పోలీసులు నేరాలు జరిగేందుకు అవ కాశం లేకుండా ప్రజలను చైతన్యపరుస్తున్నారు. పోక్సో కేసులు వంటి వాటి లో బంధువులు.. పరిచయం ఉన్న వారి ప్రమేయం ఉంటోంది. అందుకే సామాజికంగా పెద్దఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తూ మహిళలకు.. ప్రజ లకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నాం. రక్షణ కోసం పోలీసులను వెంటనే సంప్రదించేలా చైతన్యపరుస్తున్నాం.

● **ప్ర:** సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు మీరు తీసు కుంటున్న చర్యలు ఏమిటి?

జ: సైబర్ నేరగాళ్లు టెక్నాలజీని ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఈ నేరాలను పరిశోధించేందుకు, నైపుణ్యాలను పెంపొందించేందుకు చర్యలు తీసుకున్నాం. అవసరమైన పరికరాలను కొనుగోలు చేస్తున్నాం. డిజిటల్ అరెస్ట్, జాబ్ ఫ్రాడ్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్.. వంటివి తరుచూ నమోదవుతు న్నాయి. సోషల్ మీడియా ద్వారా వచ్చే ప్రకటనలతో ప్రజలు మోసపోతు న్నారు. అవగాహన కల్పిస్తున్నా కేసులు నమోదవుతున్నాయి. 'డిజిటల్ అరెస్ట్ అనేది వ్యవస్థలోనూ.. పోలీసు డిపార్ట్‌మెంట్‌లోనూ.. జ్యుడీషియల్ లోనూ లేదు'. సైబర్ నేరగాళ్లు ప్రముఖులను.. ఆర్థికంగా ఉన్నవారిని గుర్తించి నేర్పుగా వల విసురుతున్నారు. అజ్ఞాతవ్యక్తి చెప్పింది నిజమని నమ్మి జనం మోసపోతున్నారు. మోసానికి గురైతే వెంటనే 1930, డయల్ 100, 112కు కాల్ చేయాలి. అధునాతన టెక్నాలజీ పరికరాల విని యోగంపై పోలీసులకు శిక్షణ ఇస్తున్నాం.

● **ప్ర:** గంజాయి రవాణా, డ్రగ్స్ నియంత్రణలో పోలీసులు ఎంతవరకు విజయవంతమయ్యారు?

జ: గతంలో అల్లూరిసీతారామరాజు జిల్లాలో 93 ఎకరాల్లో గంజాయి సాగుచేసేవారు. దాన్ని నిర్మూలించాం. గిరిజనులను ప్రత్యామ్నాయ పంట ల వైపు మళ్లించి.. జీవనోపాధి కల్పించాం. రేంజ్ పరిధిలో గంజాయి సాగు లేదు. ఒడిశా నుంచి.. ఈ ప్రాంతాల మీదుగా గంజాయి తీసుకువెళ్లి అక్క డ ఉన్న వారికి విక్రయిస్తున్నారు. వారే ఎక్కువగా ఇక్కడ పట్టుబడుతు న్నారు. ఏడాదిన్నర కాలంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యకలాపాలు పెంచాం. పక్క రాష్ట్రం నుంచే రవాణా అవుతోంది. పూర్తిగా దాన్ని నిర్మూలించే ప్రయ త్నం చేస్తున్నాం. సరిహద్దుల్లో 300 ప్రాంతాల్లో లైవ్‌లీ చెక్‌పోస్టులను ఎస్పీ స్థాయిలో నిర్వహిస్తున్నాం. అటువంటి చోట్లనే గంజాయి పట్టుబడుతోంది. గంజాయిని రవాణా చేసే 54 గ్యాంగ్‌లు గుర్తించి.. 97 మందిపై కేసులు పెట్టాం. 1700 మందిపై సస్పెక్టెడ్ షీట్స్ తెరిచాం. గిరిజన ప్రాంతాల్లో యువతకు అవగాహన కల్పించేలా 20 వేల శిబిరాలు నిర్వహించి.. గంజాయి, డ్రగ్స్ జోలికి వెళ్లొద్దని చెప్పాం. రేంజ్ పరిధిలో గంజాయి వినియోగం.. లభించడం చాలావరకు తగ్గింది.

● **ప్ర:** పోలీసు-ప్రజల మధ్య నమ్మకాన్ని పెంపొందించడానికి మీరు అనుసరిస్తున్న విధానం ఏమిటి?

జ: పోలీసులకూ కౌన్సెలింగ్ ఇస్తున్నాం. ప్రజలతో అనుచితంగా ప్రవర్తించే వారిపై వారిపై చర్యలు తీసుకున్నాం. ప్రజలకు సేవ చేసేందుకే పోలీసులు ఉన్నారు. పౌరుల నుంచి అభిప్రాయాలు తీసుకుంటున్నాం. పోలీసు అధికారులపై ఫిర్యాదు అందితే చర్యలు తీసుకుంటున్నాం. అప్ప టికీ పద్ధతి మార్చుకోని వారిపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటున్నాం. రేంజ్ పరిధిలో ఐదుగురు అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకున్నాం.

● **ప్ర:** పోలీసు సిబ్బందికి మానసిక ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. వారికి సహాయం చేసేలా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు?

జ: వాస్తవంగా పోలీసు సిబ్బంది ఖాళీలు ఎక్కువగా ఉన్నాయి. దీనివల్ల ఒత్తిడి ఎక్కువగా ఉంది. వీలైనంత వరకు వారికి కావాల్సిన సెలవులు ఇస్తున్నాం. పోలీసుల సంక్షేమం కోసం చర్యలు తీసుకుంటున్నాం. ఆరోగ్య భద్రతతోపాటు జిల్లా నుంచి కూడా సహాయం కల్పిస్తున్నాం. మా పరిధిలో ఉన్నంత వరకు సిబ్బందికి వారి కోరుకున్న ప్రాంతాలకు బదిలీ ఇస్తున్నాం. 90 శాతం వారి కుటుంబాలకు దగ్గరగా ఉండేలా చూస్తున్నాం. రాబోయే రోజుల్లో ఇంకా పోలీసుల సంక్షేమం కోసం ఎటువంటి చర్యలు తీసుకో వాలన్నది ఎస్పీలతో చర్చిస్తున్నాం.

● **ప్ర:** గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా భద్రత, అవగాహన కార్యక్రమాలపై మీరు ఏవిధంగా దృష్టి సారిస్తున్నారు?

జ: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నిఘా పెంచాం. డ్రోన్ పెట్రోలింగ్‌ను విస్తృతంగా పెంచుతున్నాం. బహిరంగంగా తగాదాలు పెట్టేవారిని కనిపెడుతున్నాం. తరచూ నేరాలకు కారణమవు తూ... ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే వారిపై పీడీ యాక్ట్ పెడుతు న్నాం. రేంజ్ పరిధిలో గట్టిగానే చేశాం. ఇటీవల ఎచ్చెర్ల ఘటనే ఉదాహర ణ. పోలీసులు ప్రజలతో మమేకమయ్యేలా తరుచూ కార్యక్రమాలు నిర్వహించి సమాచార సేకరణ వ్యవస్థను పటిష్టం చేస్తున్నాం.

● **ప్ర:** టెక్నాలజీ ఆధారిత పోలీసింగ్ (సీసీ టీవీలు, కమాండ్ కంట్రోల్ సెంటర్స్) రేంజ్‌లో ఎంతవరకు విస్తరించింది?

జ: ప్రతి జిల్లాలో పదివేల సీసీ టీవీలు ప్రజల సహకారంతో పెట్టాలని కార్యక్రమం మొదలుపెట్టాం. అది మంచి ఫలితాలను ఇస్తోంది. సీఎస్ఆర్ ద్వారా డ్రోన్స్‌ను వినియోగిస్తున్నాం. జిల్లా స్థాయిలో కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షించి.. నేర నియంత్రణతో పాటు.. నేరాలు జరిగితే వెంటనే స్పందించేలా అవకాశం ఏర్పడుతోంది. అందుకే పైలెట్ బేస్‌గా కొన్ని ప్రాంతాల్లో జిల్లాలో చేస్తున్నాం.

● **ప్ర:** యువత మాదకద్రవ్యాల వినియోగం, సోషల్ మీడియా ఉప యోగం వంటి అంశాలపై పోలీసులు చేపడుతున్న చైతన్య కార్యక్రమాలు ఏంటి?

జ: యువత మాదక ద్రవ్యాల జోలికి వెళ్తే.. ఒనగూరే అనర్థాలను కళా శాలలు, ప్రాంతాల వారీగా తరుచూ తెలియజేస్తున్నాం.. తక్కువ డబ్బుతో ఎక్కువ సంపాదించవచ్చనే ఆలోచనతో అధికంగా యువత నేరాలకు పా ల్పడుతున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఏం చేస్తున్నారో గమనించాలి. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు ఏం చేస్తున్నారో గురువులు కూడా దృష్టిపెట్టాలి. సోషల్ మీడియాలో వచ్చేవన్నింటికీ స్పందించకూడదు. వాస్తవాలు తెలుసుకోవాలి. మంచి కోసం సోషల్ మీడియాను వినియో గించాలని వివరిస్తున్నాం.

● **ప్ర:** ప్రజలకు మీరు చెప్పదలుచుకున్న సందేశం ఏమిటి?

జ: నేర నియంత్రణకు పోలీసులతోపాటు సమాజంలో ఉన్న ఇతర వ్యవస్థలు కలసికట్టుగా పనిచేయాలి. పిల్లలు, మహిళలపై జరిగే నేరాలను పూర్తిస్థాయిలో అరికట్టవచ్చు. మైనర్లకు వాహనాలను ఇవ్వొదు. ఇంటిలో ఒకరు ప్రమాద ఘటనలో ప్రాణాలు కోల్పోతే ఆ కుటుంబం అధోగతి పాలవుతుంది. అందుకే రోడ్డు భద్రత నియమాలను.. ట్రాఫిక్ నిబంధన లను ప్రతి ఒక్కరు పాటించాలి. ఇది అందరికీ సాధ్యమైనదే. ఇక ఆటోలు, బస్సులు, ఇతరత్రా రవాణాలో పిల్లలకు అనారోగ్యకరమైన స్నేహం కొందరి తో ఏర్పడుతోంది. దీంతో నేరాలకు గురవ్వడం.. నేరాలకు పాల్పడటం జరు గుతోంది. ఇటువంటి అంశాలను ప్రజలు గమనించి బాధ్యతగా వ్యవహరిం చాలి. అలాగే ఎల్.ఎన్.పేటలో పోలీసుస్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదన చేశాం.

రైతుల ఆదాయం రెట్టింపు కావాలి: మంత్రి కొండపల్లి



రైతు సమ్మేళనం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

నెల్లిమర్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతుల ఆదాయం రెట్టింపు చేయడానికి సెంచూరియన్ విశ్వ విద్యాలయం దోహదపడాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. శనివారం సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో ఏర్పాటు చేసిన రెండో రైతు సమ్మేళనం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వ్యవసాయం లాభసాటిగా మారేందుకు అవసరమైన పరిజ్ఞానాన్ని రైతులకు అందించాలని వర్సిటీ వర్గాలకు సూచించారు. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలైన పందుల పెంపకం వంటి వాటి ద్వారా కూడా రైతులు ఆదాయం పొందవచ్చునని మంత్రి శ్రీనివాస్ తెలిపారు. రైతులను ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలని కోరారు. అప్పుడే ఆర్థికంగా బాగుంటుందని అన్నారు. యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ డీఎన్.రావు మాట్లాడుతూ.. మట్టి లేకుండా వ్యవసాయం, గాలితో పంటలు పండించడం చేయవచ్చని తెలిపారు. వీటిని పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టామని తెలిపారు. ఏడాదికి రూ.3 లక్షల నుంచి 4 లక్షల వరకు ఆదాయం పొందవచ్చునని ఆయన వివరించారు. విజయనగరం, గజపతినగరం, నెల్లిమర్ల నియోజకవర్గాల్లో కొన్ని గ్రామాలను దత్తత తీసుకొని నూతన పద్ధతులను అక్కడి రైతులకు వివరిస్తామని తెలియజేశారు. విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ.. ఇక్కడ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసిన నాలుగేళ్లలోనే మంచి కోర్సులను ప్రవేశపెట్టడమే కాకుండా రైతులకు ఉపయోగపడేలా ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాళ్లను అతిథులు పరిశీలించారు. అనంతరం సీటీ స్కాన్, మోడల్ ల్యాబ్, సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్‌తో పాటు మరో రెండు ల్యాబ్‌లను మంత్రి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు లోకం నాగమాధవి, అదితి ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన నేత లోకం ప్రసాద్, వర్సిటీ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్.రాజు, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ మహంతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకూర్మనాథుని సన్నిధిలో రద్దీ



శ్రీకూర్మనాథుని దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు

గార, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీకూర్మంలోని శ్రీకూర్మనాథుడిని కార్తీకమాసం మూడో శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. స్వామి వారి దర్శనం కోసం వేకువజాము నుంచే భక్తులు క్యూలైన్‌లో నిల్చొన్నారు. శ్రీకూర్మనాథునితో పాటు లక్ష్మీదేవి అమ్మవారు, తాబేళ్ల పార్కు, శ్వేతపుష్కరిణి, దశావతారాల పార్కులను కూడా భక్తులు దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ ఈవో కె.నరసింహనాయుడు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఘనంగా భక్త కనకదాసు జయంతి



కనకదాసు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): భక్త కనకదాసు జయంతి వేడుకలను శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. తొలుత ఇన్‌చార్జి డీఆర్వో లక్ష్మణమూర్తి కనకదాసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నరసింహ స్తోత్రం, రామాధ్యాయ మంత్రం, మోహన తరంగిణి, నలచరిత్ర, హరిభక్తిసార తదితర రచనలను కన్నడంలో కనకదాసు రచించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ జీఏ సూర్యనారాయణ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

శ్రీకాకుళం అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ను అడ్డుకుంటామని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అన్నారు. దీనికి వ్యతిరేకంగా చేపట్టనున్న ప్రజా పోరాటాన్ని జిల్లా వ్యాప్తంగా ఉధృతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ నెల 12న బుధవారం జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవ ర్గ కేంద్రాల్లో నిర్వహించనున్న నిరసన ర్యాలీకి సంబంధించిన వాల్‌పోస్టర్లను పాత్రునివలస వద్ద ఉన్న జిల్లా వైసీపీ కార్యాలయంలో శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ చంద్రబాబునాయుడి ప్రభుత్వం పేద విద్యార్థులు, ప్రజలకు అన్యాయం చేసే విధంగా వైద్య కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తోందన్నారు. పోస్టర్ ఆవిష్కరణ అనంతరం కృష్ణదాస్ పార్టీ ముఖ్య నేతలతో కలిసి ర్యాలీ నిర్వహణపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు, ఎం.వి.పద్మావతి, అంధవరపు సూరిబాబు, గేదెల పురుషోత్తం, ఎన్ని ధనుంజయరావు, చిట్టి జనార్దనరావు, చల్లా శ్రీనివాసరావు, ఎం.ఎ.బేగ్, రౌతు శంకరరావు, తేజ, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యునికి జంబో కూలర్ ఫ్యాన్లు బహూకరణ



జంబో కూలర్ ఫ్యాన్లు బహూకరించిన దాతలు

అరసవల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రత్యక్షదైవం, ఆరోగ్యప్రదాత అయిన అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని శ్రీకాకుళం నగరానికి చెందిన బరాటం తిరుమల కుమార్ దంపతులు శనివారం దర్శించుకున్నారు. ఆలయానికి జంబో కూలర్ ఫ్యాన్లను బహూకరించారు. వారిని అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ బాలభాస్కరసాయి తదితరులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

సింహద్వారం వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న గ్రామస్థులు

ఇచ్ఛాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): బూర్జపాడు గ్రామంలో గల ఉమామహేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే రహదారిలో ఆ గ్రామానికి చెందిన శివంగి మోహనరావు, పుణ్యవతి దంపతులు రూ.4 లక్షలతో ని ర్మించిన సింహద్వారం ప్రథమ వార్షికోత్సవాన్ని శనివారం వేడుకగా ని ర్వ హించారు ఈ సందర్భంగా విశేష పూజలు చేశారు. అనంతరం సం గీత విభావరి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపిక



విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఇచ్ఛాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన సత్యసాయి పాఠశాల విద్యా ర్థులు ప్రణీత్, లాస్యశ్రీ, ధనుష్, నవీన్, జీవన్ అనే విద్యార్థులు రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికయ్యారని కరస్పాండెంట్ ఎస్.లక్ష్మి తెలిపారు. ఆదివారం విశాఖపట్నంలో జరుగనున్న రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో పాల్గొనేందుకు శనివారం పయనమయ్యారు. ఈ విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

పెండింగ్ కేసులను పరిష్కరించండి

ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ● ఎచ్చెర్ల పోలీసులతో సమీక్ష



సిబ్బందితో సమీక్షిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

ఎచ్చెర్ల. నవంబరు 8(ఆంధ్ర జ్యోతి): పెండింగ్‌లో ఉన్న కేసులు వేగవంతం చేసి.. పరిష్కరించాలని.. త్వరలో స్థానిక ఎన్నికలు జరుగనున్న దృష్ట్యా పోలీసులు గ్రామాలను సందర్శించి... శాంతి భద్రతలను కాపాడాలని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఎచ్చెర్ల పోలీసు స్టేషన్‌ను శనివారం ఆయన సందర్శించారు. స్టేషన్ పరిధిలోగల సిబ్బంది పనితీరు, కేసులు, దర్యాప్తు తదితర అంశాలపై సమీక్షించారు. దర్యాప్తు పారదర్శకంగా ఉండాలని స్పష్టం చేశారు. గంజాయి అక్రమ రవాణాపై దృష్టి సారించాలన్నారు. మహిళా భద్రతపై ప్రత్యేక దృష్టిసారించి పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వాహన తనిఖీలు ముమ్మరంగా చేయాలనాన్నరు. ఈ కార్యక్రమంలో జెఆర్.పురం సీఐ ఎం.అవతారం, ఎస్ఐ వి.సందీప్ కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం దృష్టికి సిక్కోలు సమస్యలు



సీఎంతో ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని మంగళగిరిలో కలుసుకున్నారు. నియోజకవర్గానికి సంబంధించిన వివిధ సమస్యలను ప్రస్తావించారు. ప్రభుత్వం నుంచి మంజూరు కావాల్సిన నిధులు.. కొత్తగా చేపడుతున్న ప్రాజెక్టుల గురించి సీఎంకు ఎమ్మెల్యే వివరించారు.

ఆలయాల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలి



కమిటీ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎస్ఐ లోవరాజు

సోంపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా ఆలయాలకు భక్తులు అధికసంఖ్యలో వస్తున్న నేప థ్యంలో కమిటీలు రక్షణ చర్యలు చేపట్టాలని ఎస్ఐ లోవరాజు కోరారు. నింబాషిణి అమ్మవారి ఆలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడు తూ భక్తులు అధికసంఖ్యలో ఉంటే కమిటీ వారే స్వయంగా కంచెలు ఏర్పాటుచేసి క్యూలైన్లో దర్శించుకొనే ఏర్పాట్లు చేయాలని సూచిం చారు. ఈ సమావేశంలో పట్టణంలోని వివిధ ఆలయ కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పొందూరులో...

పొందూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాపాక గ్రామంలోని కొండపై వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీకమాసం మూడో శనివారం పురస్కరించుకొని స్వామివారి కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఆమదాలవలస సీఐ పి.సత్యనారాయణ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఎస్ఐలు సత్యనారాయణ, బాలరాజు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



భద్రతా ఏర్పాట్లపై చర్చిస్తున్న సీఐ సత్యనారాయణ

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో సత్తా చాటండి



రాష్ట్ర స్థాయికి ఎంపికైన జిల్లా క్రీడాకారులతో శిక్షకులు

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రిలో ఈ నెల 11న జరగనున్న రాష్ట్రస్థాయి సీనియర్స్ ఫెన్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటాలని జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బలభద్రుని రాజా పిలుపునిచ్చారు. నగరంలోని టౌన్‌హాల్‌లో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి సీనియర్స్ ఫెన్సింగ్ పోటీల ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. జిల్లాలో క్రీడాకారులకు కొదవ లేదని... శిక్షణను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. సీనియర్ విభాగంలో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా శిక్షకులు జోగిపాటి వంశీ, జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు భవాని, సంపతిరావు నాయుడు, శిక్షకులు రాహుల్, హేమంత్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి పూజ



అయ్యప్ప స్వామి పూజల్లో పాల్గొన్న భక్తులు

ఎచ్చెర్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల మండలం కుంచాల కురమయ్యపేటలో శనివారం రాత్రి అయ్యప్పస్వామి పూజను ఘనంగా నిర్వహించారు. ఆలయ పీఠాధిపతి బాలభాస్కర్ శర్మ కుమారుడు కన్ని స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన పూజలో వందలాది మంది అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు. కేరళ నుంచి గురుస్వాములు ప్రత్యేకంగా ఈ పూజలకు వచ్చారు.

తప్పుడు పోస్టింగ్‌లపై వైసీపీ నేత విచారణ

ఇచ్ఛాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పలాస మండల వైసీపీ అధ్యక్షుడు శిష్టు గోపిని ఇచ్ఛాపురం పోలీస్ స్టేషన్‌కు తీసుకురావటంతో పార్టీ శ్రేణులు అక్కడికి తరలివచ్చారు. అడిషనల్ ఎస్పీ శ్రీనువాసరావు, సీఐ చిన్నమనాయుడు శనివారం ఇక్కడి పోలీస్‌స్టేషన్‌లో గోపీని ప్రశ్నిస్తున్నారని తెలుసుకున్న వైసీపీ నాయకులు స్టేషన్ వద్ద వేచి చూశారు. పలాసలో ఓ వ్యాపారి కిడ్నాప్ కేసుకు సంబంధించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టింగులు పెట్టడంతో గోపీని ఇక్కడికి తీసుకొచ్చారు. పోస్టింగ్‌లకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకొని... అతనిని విడిచిపెట్టినట్టు సీఐ తెలిపారు. ఆ సమ యంలో స్టేషన్ వద్ద వైసీపీ నాయకులు నిరసన తెలిపారు. అక్కడి నుంచి వెళ్లకపోతే కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించడంతో అంతా అక్కడ నుంచి వెళ్లిపోయారు.



అంతుచిక్కని వ్యాధితో 200 గొర్రెలు మృత్యువాత



మృతిచెందిన గొర్రెలు

గార, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జీవనోపాధి కోసం పెంచుకున్న గొర్రెలు వ్యాధితో మృత్యువాత పడడంతో వాటి యజమాని తోణంగి గంగరాజు ఆందోళన చెందుతున్నారు. గార గ్రామానికి చెందిన గంగరాజు తన గొర్రెలను కళింగపట్నం సముద్రం ఒడ్డున ఉంచారు. ఈ నేపథ్యంలో గత నాలుగు రోజులుగా ఒక్కొక్కటిగా ఇవి మృత్యువాత పడుతున్నాయి. శనివారం వరకు సుమారు 200 గొర్రెలు మృత్యువాత పడ్డాయని రైతు గంగరాజు తెలిపారు. గొ ర్రెలు మేపుకుంటూ జీవనం సాగించే రాజు అవి మృత్యువాత పడడంతో ఆందోళన చెందుతున్నారు. దీనిపై పశువైద్యశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ మృత్యువాత పడిన గొర్రెలను పరిశీలించి... పోస్టుమార్టం నిర్వహించామని చెప్పారు. ఇవి అంతర్గత పరాన్నజీవి వ్యాధితో చనిపోయినట్టు వెల్లడించారు. మిగిలినవి మృత్యువాత పడకుండా వైద్య సేవలు అందిస్తున్నామని వివరించారు.



ప్రథమ చికిత్సపై అవగాహన అవసరం


అరసవల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రథమ చికిత్సపై అందరికీ అవగాహన అవసరమని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. రెడ్‌క్రాస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్స శిక్షణ కార్యక్రమం నగరంలోని రెడ్‌క్రాస్ పరిపాలన భవనం, శాంతా కళ్యాణ్ అనురాగ నిలయంలో నిర్వహించారు. శనివారం ఈ శిక్షణ ముగింపు కార్యక్రమంలో జగన్మోహన్ రావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలలో గాయపడిన వారిని రక్షించేందుకు ప్రథమ చికిత్స ఎంతో ఉపయోగపడుతుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కె.సత్యనారాయణ, జి.రమణ, డాక్టర్ జీఆర్ శ్రీకాంత్, బి.చిన్నయిరావు, ఎ.నర్సింగరావు, గుణాకరరావు, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా వందేమాతరం గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 30 మంది శనివారం రెడ్‌క్రాస్ శిబిరంలో స్వచ్ఛంద రక్తదానం చేశారు.

జాతీయ క్రికెట్ పోటీలకు జ్యోస్మిత్ ఎంపిక

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబర్ 8(ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ క్రికెట్ పోటీల్లో భాగంగా రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచిన జిల్లాకు చెందిన తుంగాన జ్యోస్మిత్‌కు జాతీయ జట్టులో చోటు దక్కింది. వచ్చేనెల 5 నుంచి 9వ తేదీ వరకు హర్యానా రాష్ట్రంలోని రోతక్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టుకు జ్యోస్మిత్ ప్రాతినిధ్యం వహించనున్నాడు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు మన్విత...

ఇటీవల చిత్తూరు జిల్లా పలమనేరులో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ వాలీబాల్ పోటీల్లో నగరానికి చెందిన లీలా మన్విత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. స్థానికంగా ఇంటర్మీడియట్ చదువుతున్న మన్విత మాత్రమే జిల్లా నుంచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 10వ తేదీ నుంచి మధ్యప్రదేశ్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో ఆమె పాల్గొంటుంది.





ABN ఆంధ్రజ్యోతి
ఏబీఎన్- ఆంధ్రజ్యోతిలో మరిన్ని క్రైం వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి
మీ స్మార్ట్‌ఫోన్‌లో యాప్ స్టోర్ నుంచి క్యూఆర్ కోడ్ స్కానర్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుంటే, మీ ఫోన్ కెమెరా ద్వారా ఈ కోడ్‌ను స్కాన్ చేయవచ్చు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి


అప్పన్న (ఫైల్)

టెక్కలి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): నౌపడా-మెళియాపుట్టి రోడ్డులో తలగాం జంక్షన్ సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి తర్వాత గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాజగోపాలపురం గ్రామానికి చెందిన ఇజ్జువరపు అప్పన్న(45) తలగాం జంక్షన్ వైపు నడిచి వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. అప్పన్నకు భార్య పార్వతి, కుమారుడు కార్తీక్‌ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య


వెంకట్రావు(ఫైల్)

నందిగాం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): దేవుపురం పంచాయతీ తురకలకోట గ్రామానికి చెందిన మేఘవరం వెంకట్రావు(33) శనివారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వెంకట్రావు వజ్రపుకొత్తూరు మండలం బెండిగేటు సమీపంలో గల ఓ పెట్రోల్ బంకులో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆ బంకు యజమాని వద్ద రూ.30వేలు అప్పుగా తీసుకున్నాడు. అప్పు తీర్చమని ఆ బంకు యజమాని పదేపదే అడుగుతుండడంతో మనస్తాపానికి గురై వెంకట్రావు గ్రామ సమీపంలోని తోటలోని మామిడి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వెంకట్రావు భార్య నీలవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ షేక్‌మహ్మద్ ఆలీ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించామన్నారు. వెంకట్రావుకి భార్యతో పాటు కుమార్తె, తల్లి, సోదరులు ఉన్నారు.

మద్యం సీసాలతో ఇద్దరి అరెస్టు

జలుమూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): నగిరికటకంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకొని వారి నుంచి మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ బి.అశోక్‌బాబు తెలిపారు. పక్కా సమాచారం మేరకు శనివారం దాడి చేసి ఆ గ్రామానికి చెందిన నాసరి నీలయ్య, చోడి అసిరయ్యలను పట్టుకున్నట్టు తెలిపారు. నీలయ్య నుంచి ఏడు, అసిరయ్య నుంచి ఎనిమిది మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

రహదారి నిర్మించారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


పెద్దబాదాం వద్ద కల్వర్టుపై నిర్మించిన రహదారి

వజ్రపుకొత్తూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ దాటికి కొట్టుకు పోయిన రహదారిని అధికారులు తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టి రోడ్డును నిర్మించారు. పెద్దబాడాం వద్ద కల్వర్టు వరదనీటి తాకిడికి కొట్టుకుపోవడంతో సుమారు 20 గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో తుఫాన్ వదిలి ఆరు రోజులు గడిచినా రహదారి నిర్మించలేదంటూ 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి పంచాయతీరాజ్ అధికారులు స్పందించారు. దీంతో తాత్కాలికంగా రహదారిని నిర్మించి రాకపోకలను పునరుద్ధరించారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

కేటీ రోడ్డులో విద్యుత్ స్తంభాల మార్పు


కొత్తగా విద్యుత్ స్తంభాలు వేస్తున్న దృశ్యం

పలాస, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పలాస ఇందిరాచౌక్ ప్రాంతంలో పాత ఐరన్ విద్యుత్ స్తంభాలను పూర్తిగా తొలగించి పెద్ద సీసీ విద్యుత్ స్తంభాలను వేస్తున్నారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆ ప్రాంతంలో పాత స్తంభాలను తొలగించారు. విద్యుత్ లైన్లు తరచూ అంతరాయం, చెట్లు విరిగి వైర్లపై పడతుండడంతో ఇబ్బందులు ఉన్నాయని గుర్తించిన విద్యుత్ అధికారులు మొత్తం స్తంభాలను మార్పిడి చేస్తున్నారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో ఈఈ యజ్ఞేశ్వరరావు మాట్లాడుతూ పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో ప్రధాన రహదారిపై పొట్టి స్తంభాల వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయని, తరచూ విద్యుత్ సమస్యలు వస్తున్నాయని, దీన్ని గుర్తించి భారీ స్తంభాలు వేస్తున్నామన్నారు. కార్యక్రమాన్ని ట్రాన్స్‌కో జేఈలు నాగభూషణరావు, కోదండరావు, లైన్ ఇన్‌స్పెక్టర్ టి.ప్రభాకరరావు, సిబ్బంది పర్యవేక్షించారు.

కోనేరుగట్టు పనులు పరిశీలన


కోనేరు గట్టును అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఆర్డీవో కృష్ణమూర్తి

టెక్కలి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టుమహాదేవి కోనేరు గట్టుపై రూ.13 కోట్ల మాస్టర్ ప్లాన్‌తో జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. పట్టుమహాదేవి కోనేరు గట్టు చుట్టూ కాంపౌండ్ వాల్ పనులు, గేటు, సిబ్బంది భవన నిర్మాణం, పవర్‌స్టేషన్ గది వంటి పనులు పరిశీలించారు. అలాగే పట్టుమహాదేవి కోనేరు గట్టుపై మెయిన్‌గేటు, గ్లాస్‌బ్రిడ్జి, చుట్టూ సీసీ రోడ్డు, గట్టు బండింగ్ పనులపై ఆరాతీశారు. వేగవంతంగా పనులు ప్రారంభించాలని పంచాయతీరాజ్ డీఈఈ సుధాకర్‌కు సూచించారు. ఎక్కడెక్కడ ఏఏ పనులు ఎలా చేపట్టాలన్నది దిశ నిర్దేశించారు. తహసీల్దార్ సత్యం, సిబ్బంది ఉన్నారు.

షాట్‌పుట్ పోటీలకు ఎంపిక


అభినందిస్తున్న హెచ్‌ఎం, తదితరులు

పాతపట్నం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రొంపివలస జడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న కొంచాడ కార్తీక్ జాతీయ స్థాయి షాట్‌పుట్ పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం నల్ల కుమారస్వామి తెలిపారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో భాగంగా షాట్‌పుట్ విభాగంలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచాడన్నారు. హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయ సిబ్బంది, ఎస్‌ఎంసీ సభ్యులు శనివారం అభినందించారు.

రోడ్డుపక్కనే కంకర తవ్వకాలు

- రోడ్డుపైకి రాళ్లు వస్తుండడంతో రాకపోకలకు ఇబ్బంది
- పట్టించుకోని రెవెన్యూ, పంచాయతీ అధికారులు


రోడ్డు పక్కనే కంకర తవ్వకాలు చేస్తున్న దృశ్యం

పలాస రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పలాస మండలం కేదారిపురం నుంచి ఈదురాపల్లి గ్రామాలకు మధ్య గల రోడ్డుకు ఆనుకొని ఉన్న కొండగుట్టల నుంచి రాత్రిపూట కంకర అక్రమంగా తవ్వకాలు చేపడుతున్నా రెవెన్యూ, పంచాయతీ ధికారులు పట్టించుకోకపోవడంతో యథేచ్ఛగా తవ్వకాలు జరుపుకుంటున్నారు. గత 20 రోజులుగా రోజు విడిచి రోజు కంకర తవ్వకాలను రెండు మూడచోట్ల రోడ్డుకు ఆనుకొని తవ్వకాలు జరుపుకుంటున్నారు. దీంతో కొండపై నుంచి బండరాళ్లు రహదారిపైకి వచ్చి పడుతుంది. ఈ రహదారిలో ఉన్న గ్రామాలకు రాకపోకలు సాగిస్తున్న ఆటోలు, ద్విచక్ర వాహనాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్రమంగా తవ్వకాలు జరుపుతుండడంతో కంకర, రాళ్లు రోడ్డుపైకి వస్తుండడంతో రాత్రిపూట వేగంగా వచ్చే వాహనాలు అదుపు తప్పితే ప్రాణాల మీదకు అవకాశం పోలేదు. కేదారిపురం మలుపు నుంచి ఈదురాపల్లి జంక్షన్ వరకూ మూడు చోట్ల కొండల నుంచి కంకర తవ్వకాలు జరుపుతున్నా ఆ వైపునే అధికారులు సచివాలయాలకు రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకోకపోవడం విశేషం. ఇంత జరుగుతున్న కనీసం రెవెన్యూశాఖాధికారులు పట్టించుకోకపోవడంతో ఇష్టానుసారంగా వారు తవ్వకాలు జరుపుతున్నారు. శనివారం ఉదయం నుంచి తవ్వకాలు నిరంతరంగా కొనసాగించినా రెవెన్యూ, పంచాయతీ అధికారులు ఎవరూ ప్రశ్నించకపోవడం విశేషం. ఈ విషయంపై ఇప్పటికే వారికి సమాచారం అందినా ఎటువంటి స్పందన అధికారుల నుంచి రావడం లేదని ఆ గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కంకర తవ్వకాలు నిలుపుదల చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ తవ్వకాలపై పలాస మండల తహసీల్దార్ కల్యాణ్ చక్రవర్తిని వివరణ కోరగా.. అక్రమంగా తవ్వకాలు జరుపుతున్న ప్రదేశాలను పరిశీలిస్తామని, అక్ర తవ్వకాలుగా రుజువైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.


కంకర తవ్వేసి రోడ్డు పక్కకు తోసేస్తున్న పెద్దపెద్ద బండరాళ్లు

ఉపాధ్యాయుడ్ని అభినందించిన ఎమ్మెల్యే


ఉపాధ్యాయుడు అప్పారావును అభినందిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇటీవల పాతపట్నం మోడల్ స్కూల్‌లో బోటని ఉపాధ్యాయుడు బల్లెడ అప్పారావును ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రత్యేకంగా అభినందించారు. అప్పారావు మాస్టర్ కళాత్మక బోధనతో విద్యార్థులకు విజ్ఞానాన్ని అందిస్తున్నారని, అంతేకాకుండా సైన్స్ ల్యాబ్‌ను విద్యార్థులకు ఆకర్షించేలా తీర్చిదిద్దడంతో ఎక్స్ వేదికగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రశంసించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శనివారం అతడిని సత్కరించి అభినందించారు. ఆయనతో పాటు కూటమి నాయకులు ఉన్నారు.

కార్యకర్తలకు అండగా టీడీపీ

పాతపట్నం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త కనపాల మధు కుటుంబ సభ్యులకు పార్టీ అందించిన బీమా పరిహారం మంజూరు పత్రాన్ని శనివారం తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అందజేసి మాట్లాడారు. రూ.100 చెల్లించి పార్టీ సభ్యత్వం పొందిన మధు కుటుంబానికి రూ.5 లక్షల బీమా పరిహారం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు మంజూరు చేశారన్నారు. కార్యకర్తల సంక్షేమమే లక్ష్యంగా టీడీపీ అధిష్ఠానం ముందుకు వెళ్తుందన్నారు. ఈ సందర్భంగా మధు కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అతడి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పైల బాబ్జీ, సైలాడ సతీష్, మడ్డు రామారావు, టి.తిరుపతిరావు, ఎ.సన్యాసి నాయుడు, నందిగామ ఆనందరావు తది తరులు పాల్గొన్నారు.

ఈఎండీఎంపై నేపాల్ బృందం అధ్యయనం


నేపాల్ బృంద సభ్యులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

వజ్రపుకొత్తూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): నేపాల్ దేశానికి చెందిన సోషల్ సర్వీస్ సెంటర్‌కి చెందిన ఆరుగురు సభ్యుల బృందం నగరపంల్లి హైస్కూల్‌ను శనివారం సందర్శించారు. పాఠశాలలో అమలవుతున్న ఈఎండీఎం (వ్యవస్థాపన మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం) అధ్యయనంలో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన వినూత్న ప్రాజెక్టులను చూసి అభినందించారు. వీటితో విద్యార్థులు తనచుట్టూ ఉన్న సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారం కనుక్కొని సమాజానికి ప్రభావితం కాకుండా వారిని వ్యవస్థాకులుగా రూపొందించిన కార్యక్రమంగా చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం టి.హేమారావు, ఈఎండీపీ జిల్లా మేనేజర్ అనూష, పాఠశాల చైర్మన్ లక్ష్మీపతి, ఈఎండీపీ ఉపాధ్యాయులు కె.శ్రీనివాసరావు, నేపాల్ బృందం సభ్యులు హిరసింగ్, తాప, మాధవ్ భట్టారి, మాయ అధికారి, మేనక చట్టారి, జీబ్ రాజ్‌రెగ్మి, సమీక్ష రెగ్మి ఉన్నారు.

క్రీడలపై దృష్టి సారించాలి


విద్యార్థులతో సెటిల్ ఆడుతున్న ఆంధ్ర క్రికెట్ కోచ్ శ్రీనివాసరావు

కోటబొమ్మాళి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై దృష్టి సారించాలని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కోచ్ కుప్పల శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండలంలో గల ఓ ప్రైవేట్ పాఠశాలలో క్రీడా క్లబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం పలు ప్రైవేట్ పాఠశాలల్లో క్రీడా మైదనాలు లేక విద్యార్థులు ఆటలకు దూరం అవుతున్నారని, ప్రతి పాఠశాలలో కనీసం వారాని ఒక గంట సమయం క్రీడలకు కేటాయించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన కాసేపు విద్యార్థులతో క్రికెట్, షెటిల్, టెన్నిస్ తదితర ఆటలు ఆడిపించారు.

అపరాల సాగుతో అదనపు ఆదాయం


ప్రకృతి వ్యవసాయం సాగుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

జలుమూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అపరాల విత్తనాలతోపాటు రెండున్న కిలోల 11 రకాల విత్తనాలు కలిపి జల్లుకుంటే మరో ఆరు నెలలు ఆదాయం పొందవచ్చునని ప్రకృతి వ్యవసాయం ట్రైనర్ తోట రమణ తెలిపారు. యలమంచిలికి చెందిన చెంచలి పాపారావు గాయత్రి ప్రకృతి వ్యవసాయ బయో రిసోర్సు సెంటరులో రబీ అపరాలలో ఆర్డీఎస్ విత్తనాలు కిట్లు రైతులకు శనివారం అందుబాటులో ఉంచి రైతులకు అవగాహన కల్పించారు. అపరాలతో పాటు గోంగూర, తోటకూర, అలసంద, బెండ, గోరుచిక్కుడు, పాలకూర, కొత్తిమీర, బీర, కంది, ముల్లంగి, కట్టె జనుము విత్తనాల ప్యాకెట్లు సిద్ధం చేశారు. ఈ సాగు వల్ల భూసారం పెరిగి ప్రధాన పంటకు తెగులు, పురుగులు ఆశించవని ఆయన తెలిపారు. వివిధ రకాల సూక్ష్మజీవులు అభివృద్ధి చెందుతాయని ఆయన తెలిపారు. రైతులు ప్రకృతి వ్యవసాయ సాగుపై శ్రద్ధ చూపాలని ఆయన కోరారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు


సామూహిక పూజల్లో పాల్గొన్న భక్తులు

నరసన్నపేట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కిల్లాం గ్రామంలో శనివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసం బహుళ తదియ పర్వదినం పురస్కరించుకొని గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీరమా సమేత శ్రీలక్ష్మీనారాయణ స్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో విశ్వ హిందూ పరిషత్ వారి ఆధ్వర్యంలో గ్రామ పురోహితులు దుర్గాప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో సామూహిక వ్రతాలు నిర్వహించారు. ఈ సామూహిక సత్యనారాయణ వ్రతాల్లో పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి తరించారు.

రోడ్లపై పశువుల తిష్ఠ

- ప్రమాదాలకు గురవుతున్న వాహనచోదకులు
- వదిలేస్తున్న యజమానులు.. పట్టించుకోని అధికారులు


పల్లిపేట జంక్షన్ సమీపాన రోడ్డుపై తిష్ఠవేసిన పశువులు

నరసన్నపేట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట పట్టణంలో రోడ్లపై పశువుల సంచారాన్ని అరికట్టడంలో అధికారుల పూర్తిగా విఫలమయ్యారు. పట్టణ ప్రధాన రహదారులపై ఎటుచూసినా పశువులు నిత్యం కుమ్ములాడుకుంటూ బీభత్సం సృష్టిస్తున్నారు. మెయిన్‌రోడ్డు, కాలేజీ రోడ్డు, పాతబస్టాండ్, వంశధార నగర్, మసీదు వద్ద తదితర ప్రాంతాల్లో ఎక్కడ చూసినా పశువులు గుంపులుగా రోడ్లపై తిష్ఠ వేస్తున్నాయి. రాత్రి అయితే చాలు ప్రధాన రహదారులపై పడుకుని వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి. ఆకస్మాత్తుగా రోడ్డు పైకి వస్తుండడంతో వాహనచోదకులు ప్రమాదాల బారినపడుతున్నారు. రోడ్లపై పశువులను వదలిపెడుతున్న యాజమానులపై పట్టణ ప్రజలు పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా ప్రయోజనం శూన్యం. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి ఈ సనమ్యను పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కానరాని బాలుడి ఆచూకీ


సాయినేతాజీ (ఫైల్)

శ్రీకాకుళం క్రైం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏడు రోడ్ల కూడలికి సమీపంలో గల వంతెన పైనుంచి నాగావళి నదిలో శుక్రవారం రాత్రి దూకిన అలుగోలు సాయి నేతాజీ (17) ఆచూకీ శనివారం కూడా లభ్యం కాలేదు. నగరంలోని గుజరాతీపేట శివాలయంవీధికి చెందిన ఉమారుద్ర కోటేశ్వరరావు కుమారుడు సాయినేతాజీ. శుక్రవారం సాయంత్రం బయటకు వెళ్లిన నేతాజీ ఆలస్యంగా ఇంటికి రావడంతో అతడి తండ్రి మందలించాడు. ఈ క్రమంలో క్షణికావేశానికి లోనైన నేతాజీ సమీపంలో గల బ్రిడ్జిపై నుంచి నాగావళి నదిలోకి దూకేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది నది పరిసరాల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో రెండో రోజు శనివారం కూడా గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. కాగా నేతాజీ అదృశ్యంపై తండ్రి కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు టూటౌన్ ఎస్ఐ లక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూడో సోమవారం సెలవుగా ప్రకటించాలి

టెక్కలి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మూడో సోమవారం ఉన్నత పాఠశాలలకు స్థానిక సెలవుగా ప్రకటించుకునే అవకాశం ఇవ్వాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న, ప్రధానకార్యదర్శి పేడాడ కృష్ణారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏటా పవిత్రమైన కార్తీక మాసంలో వచ్చే మూడో సోమవారం పాఠశాలలకు స్థానిక సెలవు ఇవ్వడం ఆనవాయితీగా వస్తున్నప్పటికీ అదేరోజు ఆరు నుంచి పది తరగతుల విద్యార్థులకు సమ్మేటివ్ తెలుగు పరీక్ష పెట్టడం సమంజసం కాదని అన్నారు. సమ్మేటివ్ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభం అయ్యేలా జిల్లా, రాష్ట్ర విద్యాశాఖ అధికారులు చర్యల తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ట్రాన్స్‌కో ఏఈగా రామచరణ్


బాధ్యతలు చేపట్టిన రామచరణ్ గుప్త

నరసన్నపేట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రాన్స్‌కో ఏఈగా బి.రామచరణ్ గుప్త శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏఈగా పనిచేసిన కోటేశ్వరరావు మూడు నెలలు క్రితం కోటబొమ్మాళి బదిలీపై వెళ్లడంతో ఖాళీ అయింది. దీంతో పోస్టులో విశాఖ జిల్లాలో సబ్ ఇంజనీరుగా పనిచేసి పదోన్నతి పొందిన రామచరణ్ గుప్తను నరసన్నపేట ట్రాన్స్‌కో ఏఈగా నియమితులయ్యారు.

రీసెర్చ్ సెంటర్‌గా 'ఐతం'

టెక్కలి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కె.కొత్తూరు దరి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలకు జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ విశ్వవిద్యాలయం నుంచి పరిశోధనా కేంద్రంగా గుర్తింపు లభించిందని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వీవీ నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గుర్తింపు పత్రాన్ని జేఎన్‌టీయూ ఉపకులపతి చేతులు మీదుగా అందుకోవడం జరిగిందని తెలిపారు. ఈ గుర్తింపు రెండేళ్ల వరకు వర్తిస్తుందన్నారు.

వెంకన్నకి ప్రత్యేక పూజలు

నందిగాం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కార్తీక మూడో శనివారం పురస్కరించుకొని పెంటూరులోని వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచి స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సుభద్రాపురం వేంకటేశ్వర ఆలయం, కొండ తెంబూరు రామాలయంతోపాటు పలు శివాలయాల్లో కూడా భక్తులు పూజలు నిర్వహించారు.

అక్రమ కట్టడాలపై ఫిర్యాదు

నరసన్నపేట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ పరిధిలో గల డ్రైనేజీలను కొంతమంది ఆక్రమించి కట్టడాలు చేపడుతుండడంపై జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేసినట్టు పట్టణానికి చెందిన పైడి రామచంద్రరావు తెలిపారు. నరసన్నపేట పట్టణంలో జీటీ రోడ్డును ఆనించి ఉన్న ఓ షాపింగ్ కాంప్లెక్స్ యజమాని నిర్మాణాలు చేపట్టి అద్దెకు ఇచ్చారన్నారు. ఇప్పుడు సుమారు ఆరు అడుగల మేర డ్రైనేజీ ఆక్రమించి రీమోడలింగ్ చేస్తున్నారన్నారు. సదరు షాప్‌ను నాన్ కమర్షియల్ కింద అనుమతులు పొంది ఇప్పుడు పూర్తిస్థాయి కమర్షియల్ షాపుగా పనులు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కట్టడాలకు గ్రామ పంచాయతీ నుంచి ఎటువంటి అనుమతులు పొందలేదన్నారు. దీనిని పరిశీలించి గ్రామ పంచాయతీ స్థలాన్ని పరిరక్షించాలని కోరినట్టు తెలిపారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ కార్యనిర్వహణాధికారికి, ఎంపీడీవోకు ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు.

వెంటాడుతున్న భవనాల కొరత

- చాలీచాలని వసతిలోనే మత్స్యకార రెసిడెన్షియల్ పాఠశాల నిర్వహణ
- వర్షాలకు కారిపోతున్న భవనాలు
- ఇబ్బందిపడుతున్న విద్యార్థులు


అక్కుపల్లి బీసీ గురుకుల పాఠశాల

వజ్రపుకొత్తూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అక్కుపల్లి వద్ద ఉన్న మహాత్మ జ్యోతిబా పూలే మత్స్యకార బీసీ బాలురు గురుకుల పాఠశాలకు భవనాల కొరత వెంటాడుతుంది. 2017లో అప్పటి ముఖ్యమంత్రిగా చంద్రబాబు మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఇచ్చిన హామీమేరకు మత్స్యకార బీసీ గురుకుల పాఠశాలను మంజూరు చేసి అప్పటికే ఖాళీగా ఉన్న అక్కుపల్లి ఎస్సీ హాస్టల్ భవనంలో తాత్కలికంగా ఏర్పాటు చేశారు. తర్వాత భవనాలు కొరత ఉండడంతో కలెక్టర్ ఆదేశాలు మేరకు పక్కనే ఉన్న బైపల్లి తుఫాన్ రక్షిత భవనాన్ని కూడా గురుకుల పాఠశాలకు అప్పగించారు. అయితే తుఫాన్లు, విపత్తుల సమయాల్లో రక్షిత భవనం ఖాళీ చేయాల్సి వస్తుండడంతో తరగతులు నిర్వహణ కష్టంగా ఉంటుంది. ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు రెండేసి సెక్షన్లతో 480 మంది విద్యార్థులు చదవుతుకునేందుకు జీవో ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో వసతి లేక ఒకే సెక్షన్‌తో పాఠశాల నడుతుపున్నారు. అయితే ప్రస్తుతం ఉన్న ఎస్సీ హాస్టల్ భవనం వర్షానికి కారుతుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది కురిసిన వర్షాలకు పాఠశాల ప్రహరీ కొంతమేర పడిపోయింది. ఆ సమయంలో విద్యార్థులు ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రస్తుతం పాఠశాలలో 150మంది విద్యార్థులు చదువుతుండగా, 30మంది ఉపాధ్యాయులు, సిబ్బంది ఉంటున్నారు.

స్థలం ఉన్నా..

పాఠశాల మంజూరు సమయంలోనే పక్కా భవనాలను బెండికొండ వద్ద నిర్మించడానికి అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.40 కోట్లు మంజూరు చేసినా పనులు ప్రారంభించలేదు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ స్థలాన్ని జగనన్న కాలనీకి కేటాయించింది. అయితే గురుకుల అధికారులు జిల్లా అధికారులను ఒప్పించి బెండికొండపై మరోచోట 10 ఎకరాల స్థలం కేటాయించారు. ప్రస్తుతం ఆ స్థలం కూడా ఆక్రమణకు గురువుతున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

ప్రతిపాదనలు పంపించాం

గదులు సమస్య వల్ల అదనపు సెక్షన్ నిర్వహించడం లేదు. అదనపు సెక్షన్ నిర్వహణ వల్ల పది మంది ఉపాధ్యాయులకు, మరో పది మంది ఇతర సిబ్బందికి స్థానికంగా ఉపాధి అవకాశాలు అందించే అవకాశం ఉంది. అదనపు గదులు లేకపోవడంతో మరో 240 మంది విద్యార్థులు చదవుకొనే అవకాశం లేకుండా పోయింది. వసతి సమస్యల పరిష్కారానికి ప్రతిపాదనలు పంపించాం.

- ఈశ్వరరావు, ప్రిన్సిపాల్